ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 27 ఫిబ్రవరి 2025



సోమల మండలం దుర్గంకొండ ఆలయంలో అభిషేక పూజలు

ఆదిదేవుడైన మహాశివుడికి ఇష్టమైన మహాశివరాత్రి వేడుకలను జిల్లావ్యాప్తంగా బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేకాభిషేకాలు, విశేష పూజలతో శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. 'హర హర మహాదేవ.. శంభో శంకర..' అంటూ శివ నామస్మరణతో ఆలయాలు మార్మోగిపోయాయి. సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసిన శైవక్షేత్రాలన్నీ అశేష భక్తజనంతో కిటకిటలాడాయి.



కార్వేటినగరంలోని స్కంధపుష్కరిణి సమీపంలో వున్న తంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

శంభో శంకరా...!





నగరి బుగ్గ దేవాలయంలో విశేషాలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి



నిజరూప దర్శనంలో మొగిలీశ్వరస్వామి





చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి- ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు - గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

- కోటిలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు
- 108 అడుగుల శివలింగానికి పాలాభిషేకం

మొగిలీశ్వరాలయం కిటకిట

బంగారుపాళ్యం,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం మండలం మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. బుధవారం ఉదయం స్వామి,అమ్మవార్లను సుగంధభరితమైన పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.ఉమ్మడి చిత్తూరు జిల్లానుంచే కాక కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తుల మొగిలి కిటకిటలాడింది. సాయంత్రం 3 గంటలకు కాణిపాక ఆలయం నుంచి ఈవో పెంచల కిషోర్‌తో కలసి ఎమ్మెల్యే మురళీమోహన్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేక పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. స్వామి,అమ్మవార్లు వృషభవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ జమీందార్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎస్పీ మణికంఠ కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు.ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు.బంగారుపాళ్యంతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం మొగిలి దేవస్థానం వరకు ఈశ్వర్ కళ్యాణ్ అభయం ట్రస్టు నిర్వాహకులు ఉచిత బస్సులను నడిపారు.కురప్పల్లికి చెందిన



సుకుమార్, శ్రీని ఫుడ్ పార్క్ యాజమాన్యం భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్,చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్పీ జయప్రకాష్, కాణిపాక ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ధరణీప్రసాద్ నాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ అధికారిణి సుమన్‌ప్రియ, అర్చకులు హరికేష్ గురుకుల్, మంజునాథ గురుకుల్,సోము గురుకుల్,దండపాణి గురుకుల్ పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం అభిషేకం,రావణబ్రహ్మ వాహన సేవ, రాత్రి శేషవాహన సేవ వుంటాయి.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాక ఆలయ ఈవో కిషోర్

జనసంద్రమైన కమ్మసంద్ర

వి.కోట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి):వి.కోటకు 18కిలోమీటర్ల దూరంలో వున్న కమ్మసంద్రలో వెలసిన కోటిలింగేశ్వరాలయం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తజనసంద్రంగా మారింది. ఆలయంలో వెలసిన కోటిలింగేశ్వరుడికి ఉదయాన్నే పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. ఆపై ప్రత్యేకంగా పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 10 గంటలకు 108 అడుగుల మహాశివలింగానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి ఆలయమాడవీధుల్లో ఊరేగించారు. రథం ముందు కోలాటాలు, పండరి భజనలు, భక్తి గీతాలాపనలు, బాణసంచా వెలుగులు, మంగళవాయిద్యాలతో ఆ ప్రాంతం మార్మోగింది. రాత్రి జరిగిన స్వామివారి పల్లకి ఊరేగింపును చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కేజీఎఫ్ మార్గం పూర్తిగా వాహనాలతో కిక్కిరిసిపోయింది.ఆలయ ఆవరణంలో ప్రతిష్ఠించిన వేలాది శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ తరపున భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంచిపెట్టారు.మహాశివలింగం వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు జనం ఎగబడ్డారు.



108 అడుగుల మహాశివలింగం వద్ద భక్తుల సందడి - ప్రత్యేక అలంకరణలో కోటిలింగేశ్వరస్వామి



సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారు

- పనులను పరిశీలించిన విప్, కలెక్టర్

గంగాధరనెల్లూరు/వెదురుకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటవ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు గంగాధరనెల్లూరు పర్యటన షెడ్యూల్ ఖరారైంది.మరోవైపు సీఎం పర్యటన కోసం వివిధ శాఖల అధికారులు రెండురోజులుగా గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రజావేదిక, స్టాళ్ల ఏర్పాటు పనుల్లో బిజీగా వున్నారు. రామానాయుడుపల్లె వద్ద హెలిపాడ్ పనులను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు.గంగాధర నెల్లూరు బీసీ కాలనీలో పెన్షనర్ మునికృష్ణయ్యశెట్టికి, దళితవాడలో మరో పెన్షనర్ శ్రీనివాసులు ఇళ్ళకు వెళ్ళి సీఎం పెన్షన్ సొమ్ము అందజేయనున్న నేపథ్యంలో వారి ఇండ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై.వి.రాజేశ్వరి,జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, లోకనాథ యాదవ్, రుద్రయ్యనాయుడు, జయశంకర్‌నాయుడు, నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్, మండల జనసేన అధ్యక్షుడు సురేష్ రెడ్డి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేంద్రన్, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు అరుణమ్మ,మండల బీజేపీ అధ్యక్షుడు ఆనందబాబు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా....

మార్చి ఒకటవ తేదిన ఉదయం విజయవాడ నుంచి విమానంలో బయల్దేరి 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు.11.35 గంటలకు అక్కడినుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 11.50 గంటలకు గంగాధరనెల్లూరుకు వస్తారు.11.50 గంటల నుంచి 12గంటల వరకు హెలిపాడ్‌లో ప్రజాప్రతినిధులను, అధికారులను పలకరించాక 12.10 గంటలకు పెన్షన్ లబ్దిదారుల ఇంటికి చంద్రబాబు చేరుకుంటారు.12.40 గంటల వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.1.30 గంటలనుంచి 2.30 గంటల వరకు గ్రామస్తులతో మమేకమవుతారు. 2.30 గంటలకు విజయవాడ బయల్దేరి వెళతారు.



రామానాయుడుపల్లె వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ థామస్, కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

84 మంది తిరుపతి విద్యార్థులకు ఊరట

- చిత్తూరు జిల్లాలో పరీక్ష రాసేలా అనుమతించిన ఇంటర్‌బోర్డు అధికారులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జూనియర్ కళాశాలల యాజమాన్యాల నిర్వాకంతో 84 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు రాని విషయం తెలిసిందే. ఎట్టకేలకు వీరికి చిత్తూరు జిల్లానే పరీక్షలు రాసేలా ఇంటర్‌బోర్డు అధికారులు అనుమతించడంతో కథ సుఖాంతమైంది. వివరాల్లోకి వెళితే.. పెనుమూరులో శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలను నిర్వాహకుడు సురేంద్రరెడ్డి ఏడాది కిందట తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్ఎస్ఆర్ కళాశాలకు చెందిన ఓంప్రకాష్ అనే వ్యక్తికి అమ్మేశాడు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన 84 మంది విద్యార్థుల పేర్లు మాత్రం పెనుమూరులోని కళాశాలలో ఉన్నట్లు ఇంటర్మీడియట్ లాగిన్‌లో నమోదైంది. నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించలేదు. దీంతో హాల్ టికెట్లు రాలేదు. ఈ వ్యవహారం రెండు జిల్లాల్లో చర్చనీయాంశంగా మారి, చివరకు కమిషనరేట్ కార్యాలయానికి చేరింది. అక్కడి అధికారుల సూచనతో విచారణ చేపట్టాలని డీవీఈవో సయ్యద్ మౌలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పెనుమూరు కళాశాల నిర్వహణ లోపాన్ని గుర్తించిన అధికారులు.. యాజమాన్యానికి నోటీసులు కూడా ఇచ్చారు. దీనిపై 'లేని కాలేజ్.. ఉన్నట్లుగా..!?' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.

మానవతా దృక్పథంతో..

84 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాసే అవకాశం ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు పెనుమూరు కళాశాలను కొనుగోలు చేసిన తిరుపతి ఎస్ఎస్ఆర్ కళాశాల నిర్వాహకుడు ఓంప్రకాష్ విజ్ఞప్తి చేశారు. మానవతా దృక్పథంతో కళాశాలకు ఫైన్ విధించడంతోపాటు పెద్ద మొత్తంలో అపరాధ రుసుంతో విద్యార్థుల ఫీజు చెల్లించే వీలును ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కల్పించారు. అయితే తిరుపతికి చెందిన విద్యార్థుల పేర్లు చిత్తూరు జిల్లా కింద నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను కూడా చిత్తూరులోనే కేటాయించాలని బోర్డు అధికారులు డీవీఈవోకు సూచించారు. 84 మంది విద్యార్థులకు ఒకే సెంటర్ కేటాయిస్తే ప్రశ్నపత్రాల సమస్య తలెత్తుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్కో సెంటర్‌కు ఆరు నుంచి ఏడుగురు విద్యార్థుల చొప్పున చిత్తూరు జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లు కేటాయించినట్లు డీవీఈవో తెలిపారు. దీంతో తిరుపతి విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షలు చిత్తూరు జిల్లాలో కేటాయించిన సెంటర్లలో రాయనున్నారు.



డీఎంహెచ్‌వో ఆఫీసులో ముందుకు కదలని ఫైళ్లు !

- ఉన్నతాధికారి తీరుతో గందరగోళ పరిస్థితి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో గందరగోళ పరిస్థితి నెలకొందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డీఎంహెచ్‌వోగా సుధారాణి బాధ్యతలు తీసుకున్నాక సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ఉద్యోగులకు, సిబ్బందికి అవకాశం కల్పించడం లేదన్న విమర్శలున్నాయి. అలాగే నచ్చిన వారికే కీలక బాధ్యతలు అప్పగిస్తారనే పేరూ తెచ్చుకున్నారు.తుంబకుప్పం పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి సీసీగా నియమించుకోవడం, కీలకమైన ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు, డాక్టర్లకు సంబంధించిన సర్వీసు విషయాలు కూడా ఆయనకే అప్పజెప్పడం మిగిలిన సిబ్బందిలో అసహనాన్ని పెంచింది.జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన పలు ప్రోగ్రాములకు విభాగాధిపతులుగా ఉన్న సీనియర్ వైద్యాధికారులను తప్పించి ఆయా స్థానాల్లో పీహెచ్‌సీల్లో పనిచేసే పలువురు జూనియర్ డాక్టర్లకు బాధ్యతలప్పగించడంపై సీనియర్లు ఆగ్రహంగా వున్నారు.సీనియర్లయితే మాట వినడం లేదనే జూనియర్లకు బాధ్యతలు కట్టబెట్టారని వారు చెబుతున్నారు. పీహెచ్‌సీ వైద్యులు పీజీ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సర్వీసు సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే దీని కోసం కూడా నగదు వసూలు చేయడంపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారి తీరుతో ఫైళ్లన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయని ఉద్యోగ సంఘ నాయకులు చెబుతున్నారు.గత వారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖతో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరుగుతున్న తంతుపై సీరియస్‌గా హెచ్చరించినట్లు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లకు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులందడంతోనే ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ నిందితునికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువకుడు 12 ఏళ్ల బాలికపై 2019లో అత్యాచారం చేశాడు. దీనిపై స్థానిక పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు మంగళవారం వాయిదాకు రాగా, పూర్వాపరాలు పరిశీలించాక నేరం రుజువుకావడంతో యువకుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పు చెప్పారు. ఈ కేసును స్పెషల్ పీపీ మోహన కుమారి వాదించారు.

స్క్రాప్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- చిత్తూరు నగరంలో 13 సంస్థల రిజిస్ట్రేషన్ రద్దు చేసిన కమర్షియల్ ట్యాక్స్ అధికారులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రాప్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ (జేసీ) జాన్ స్టీవెన్‌సన్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా అక్రమంగా స్క్రాప్ రవాణా చేస్తున్న 13 వ్యాపార సంస్థలను గుర్తించి, వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మరికొన్ని సంస్థలకు భారీగా జరిమానా విధించినట్లు వివరించారు. ఈ 13 సంస్థలు ఒకే వ్యక్తికి సంబంధించినవిగా గుర్తించామన్నారు. కట్టమంచిలోని ఇతనికి చెందిన ఓ సంస్థలో మంగళవారం చిత్తూరు ఏసీ-1 శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి, పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. క్షుణ్ణంగా పరిశీలించాక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జీడీనెల్లూరులో డీపీఆర్సీ శిక్షణ కేంద్రం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)ని జీడీనెల్లూరు మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఉన్నప్పుడు ఈ కేంద్రం శ్రీకాళహస్తిలో ఉండేది. జిల్లాల విభజన జరిగాక చిత్తూరుకు ప్రత్యేక కేంద్ర నిర్మాణం కోసం మొదటగా చిత్తూరు నగర శివారు ప్రాంతమైన ఇరువారం వద్ద స్థల పరిశీలన చేశారు. అక్కడ అనువుగా లేకపోవడంతో జీడీనెల్లూరులో మండల కేంద్రంలో స్థలం లభ్యమవడంతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎస్ఈ పేర్కొన్నారు. ఈ కేంద్రం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు విడుదలయ్యాయని, పనులకు సంబంధించి టెండర్లకు త్వరలోనే పిలవనున్నట్లు వివరించారు.

శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తి



ధ్వజస్తంభం వద్ద అలంకరణలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): 'హరహర మహాదేవ.. శంభశంకర' అంటూ శ్రీకాళహస్తీశ్వరాలయం బుధవారం శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివ రాత్రి సందర్భంగా వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వర్ణముఖి నదిలో స్నానాలు.. పితృ దేవతలకు తర్పణం వదిలేవారు.. శంఖం పూరించే జంగమదేవరలు.. స్వామి దర్శనానికి వచ్చిన జనంతో పురవీధులు రద్దీగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు నాలుగు కాలాల అభిషేకాలు జరిగితే.. శివరాత్రి నాడు మాత్రం (బుధవారం ఉదయం నుంచి గురువారం వేకువన లింగోద్భవం వరకు) 11 కాలాభిషేకాలు నిర్వహించారు. ఇక, బుధవారం వేకువజామున 2 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. పూజల అనంతరం 3 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకం ఒకదాని వెంట ఒకటి స్వామివారికి నిర్వహించారు. వీటితో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనభాగ్యం కల్పించారు. జ్ఞానప్రసూనాంబిక దేవికీ అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున 4 గంటల నుంచే భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం లోపల భక్తులకు మహాలఘు దర్శన విధానం అమలు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయలింగం నుంచి ఆలయం పైకి వెళ్లి భక్తకన్నప్ప కొండమెట్ల మార్గం వద్దకు చేరుకునేలా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి మహాద్వారం వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో తోపులాటకు తావులేకుండా పోయింది. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్లు అందజేశారు. సుమారు లక్షన్నర మంది భక్తులు వచ్చినట్లు ఆలయాధికారుల అంచనా.



నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



ఆలయంలో భక్తుల రద్దీ

ఇంద్ర విమానంపై శివయ్య

బుధవారం ఉదయం ఇంద్ర విమానంపై స్వామి, చప్పరంపై జ్ఞానప్రసూనాంబ దేవి అధిరోహించారు. మూషికవాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగింపులో ముందు సాగారు. ఊరేగింపు ముందు కళారూప ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు



బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 11 గంటలకు: రథోత్సవం
రాత్రి 8.00 గంటలకు: తెప్పోత్సవం



పిండప్రదానాలు



ఉదయం వాహన సేవ సందర్భంగా మాడవీధిలో భక్తజనం

రాత్రి నందిసేవ

భక్తకోటిని అనుగ్రహించేందుకు బుధవారం రాత్రి నందివాహనంపై స్వామివారు, సింహవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపును తిలకించేందుకు.. జాగరణచేసి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడ వీధులు కిక్కిరిసిపోయాయి.

మహాప్రసాదంగా వాయనం

ఈసారి భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. మహిళలకు రవికతో పాటు పసుపు, కుంకుమ, గాజులను కలిపి వాయనంగా అందించారు. క్యూలైన్లలో భక్తులకు వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు.



మహిళా భక్తులకు వాయనం అందజేత



స్నానఘట్టాల వద్ద తలస్నానాలు చేస్తున్న భక్తులు



కళాకారుల విన్యాసం

మల్లప్ప కొండపై మంటలు

గుడుపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో మహా శివరాత్రి వేడుకలు జరిగిన స్వర్ణగిరి క్షేత్రమైన మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో మంటలు రేగడం కలకలం రేపింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మల్లప్ప కొండ దిగువ ఉన్న దేవరగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సంగనపల్లె పరిసర గ్రామాల నుంచి మల్లప్ప కొండకు కాలి నడకన వచ్చే భక్తులు మంటలను గమనించి కొండకు చేరుకున్నాక అక్కడున్న నాయకులకు తెలిపారు. చిన్నగా ఉన్న మంటలు గాలి ఎక్కువగా వీచడంతో పాటు మల్లప్ప కొండ అటవీ ప్రాంత్రంలో ఎండిన చెట్లు, బోద గడ్డి కారణంగా పెద్దవయ్యాయి. సాయంత్రానికి మల్లప్పకొండ చేరుకొనే బీటీ రోడ్డు వరకు మంటలు వ్యాపించాయి.కుప్పం అటవీ శాఖ అధికారి జయశంకర్ సిబ్బందితో కలసి వెళ్లి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు.తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె నుంచి ఫైర్ ఇంజన్‌ను పిలిపించి మంటలు అదుపు చేయడానికి ప్రయత్నించారు. అయితే రోడ్డుకు కొంత దూరంలో ఉన్న మంటలు అదుపులోకి రాగా దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో మంటలు ఎగిసిపడుతూనే వున్నాయి.గురువారం ఉదయానికల్లా మంటలను అదుపులోకి తెస్తామని అటవీ శాఖ అధికారి జయశంకర్ తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

ముక్కంటి సేవలో 'కన్నప్ప'



ఆలయం వద్ద మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా తదితరులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం కన్నప్ప సినిమా బృందం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మోహన్‌బాబు, విష్ణు, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద కన్నప్ప బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. వీరికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఎం చేతులమీదుగా పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు

● రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పర్యటనకు మార్చి ఒకటో తేదీన విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వీ.ఎం. థామస్ తెలిపారు. గంగాధరనెల్లూరులో బుధవారం మీడియాతో మాట్లాడారు. 10మంది నిరుద్యోగులకు ఆటోలు, 10మంది విభిన్న ప్రతిభావంతులకు మూడుచక్రాల సైకిళ్లు, ఉన్నత విద్య చదువుతున్న పేదవిద్యార్థులు 10మందికి ల్యాప్‌టాప్‌లు, ఇటీవల ఎస్టీ కాలనీలో అగ్నికి ఆహుతైన రెండిండ్ల వారికి రూ.1.30లక్షల చెక్, ఎస్సీకాలనీలో అర్హులకు ఇంటిపట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, స్వామిదాస్, రాంబాబురెడ్డి, శ్రీధర్‌యాదవ్, దేవసుందరం, పుష్పరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సోమలలో ఏనుగుల సంచారం

సోమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతలపల్లె, పొలికిమాకులపల్లె అటవీ శివారు పొలాల్లోకి మంగళవారం రాత్రి ఏనుగులు చేరుకున్నాయి. వరి, టమెటా పంటలను తొక్కి నాశనం చేశాయి. డ్రిప్ పరికరాలను ధ్వంసం చేయడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్కడా సారా కనిపించకూడదు

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌దేవ్ శర్మ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నవోదయం-2ను పక్కాగా అమలు చేసి.. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో సారా కనిపించకుండా చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశించారు. తిరుపతి ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు. రెండు జిల్లాల పరిధిలో ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంతమందిని అరెస్టు చేశారు? ఎన్ని లీటర్ల ఊట ధ్వంసం చేశారనే వివరాలు తెలుసుకున్నారు. సారా ఎక్కువగా తయారు చేస్తున్న గ్రామాలను గుర్తించి, ప్రత్యేక టీమ్‌ల ద్వారా కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ మద్యం, కల్తీ కల్లు వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, సూపరింటెండెంట్లు నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, అదనపు ఈఎస్‌లు వాసుదేవచౌదరి, ఊహశ్రీ, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధిశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు, పుంగనూరుల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ఉపాధి కల్పనశాఖ కార్యాలయంలో జరిగే మేళాకు అపోలో ఫార్మసిస్ లిమిటెడ్, క్రియానెక్ట్ వెల్త్ ప్రైవేటు లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. పుంగనూరు ఐటీఐలో జరిగే మేళాకు అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ వారు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయిన 18-30 ఏళ్లలోపున్న స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 99635 61755 (చిత్తూరు), 77805 99208 (పుంగనూరు) నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్ బాధితుల కోసం 'శ్రీబయో'

● మరో రెండు నెలల్లో అందుబాటులోకి ● స్విమ్స్ వార్షికోత్సవంలో డైరెక్టర్ ఆర్వీ కుమార్
● 9 మందికి గోల్డ్ మెడల్.. 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాల ప్రదానం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ(శ్రీబయో)ని మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలోని మహతిలో బుధవారం జరిగిన స్విమ్స్ 32వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఒకే రోజు మూడు కీలకమైన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసిన ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. స్విమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రభుత్వం, టీటీడీ తోడ్పాటు అందిస్తున్నాయన్నారు. త్వరలోనే అప్తమాలజీ, ఈఎన్‌టీ విభాగాల పీజీ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డీన్ అల్లాడి మోహన్‌తో కలిసి స్విమ్స్ యూనివర్సిటీ నివేదిక సీడీలను ఆవిష్కరించారు. ఉత్తమ సేవలందించిన ఏడుగురు వైద్యులకు, ఒక ఎంబీబీఎస్ విద్యార్థినికి, ఒక స్టాఫ్‌నర్సుకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. మరో 35 మంది వైద్యులకు ప్రశంసాపత్రాలు అందించారు. సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ఎంఎస్ రామ్, ప్రిన్సిపాల్స్ ఉషా కళావత్, మాధవి, సుధారాణి, వైద్య విభాగాధిపతులు వనజాక్షమ్మ, మధుబాబు, పీవీజీకే శర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని విద్యార్థులు పేర్కొన్నారు.

ఉచిత సిలిండర్ల సొమ్ము జమ కాలేదా..?

టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 'మహాశక్తి పథకం' కింద బియ్యం కార్డున్న ప్రతిఒక్కరికీ ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. గత ఏడాది దీపావళి రోజున దీనికి శ్రీకారం చుట్టింది. అయితే తొలిసారిగా సిలిండర్ పొందిన చాలామందికి ప్రభుత్వం అందించే రాయితీ సొమ్ము నేటికీ జమ కాని పరిస్థితి ఉండడంతో కార్డుదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సొమ్ము వస్తుందా, రాదా అనే అయోమయంలో ఉండడంతోపాటు చాలామంది వినియోగదారులు గ్యాస్ కంపెనీలకు వెళ్లి సమాచారం తెలుసుకుంటున్నారు. ఇలాంటి వారంతా టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్‌చేస్తే ఇట్టే తెలుసుకోవడానికి అవకాశం ఉంది. సిలిండర్ ధర ఆయా ప్రాంతాలను బట్టి స్వల్పంగా మారుతుంది. కేంద్రం రాయితీ కింద రూ.21.57 చెల్లిస్తుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఉచిత సిలిండర్ సొమ్మును మనం ముందుగానే ఏజెన్సీలకు చెల్లించాలి. ఆ తర్వాత 48 గంటల్లో దీనికి సంబంధించిన నగదు మన ఖాతాలకు జమచేస్తుంది. మొత్తం ఖాతాలకు జమ కాకపోయినా, దీనికి సంబంధించిన సమస్యలు ఏవైనా ఉన్నా 1967 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసి సంప్రదిస్తే, పరిష్కారం పొందడానికి అవకాశం ఉంది.

త్వరలో ప్రభుత్వాస్పత్రిలో అధునాతన ల్యాబ్



ప్రభుత్వాస్పత్రి వైద్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో త్వరలో అధునాతన ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం పలమనేరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎంవో శారద, ఆసుపత్రి వైదులు, ఇంజనీర్లతో ఎమ్మెల్యే చర్చించారు. ల్యాబ్ ఏర్పాటుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. తయారు చేసిన అంచనాలను ఎమ్మెల్యే పరిశీలించారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న నవీన్ తదితరులు

రామకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గడ్డూరుయానాది కాలనీలోని నిరుపేద కుటుంబాలకు మిట్టపల్లె రాజ్యాధికారం టీం అధినేత నవీన్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం నిత్యావసర వస్తువులను వితరణగా అందించారు. రాజ్యాధికారం టీం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామకుప్పం బీజేపీ మండలాధ్యక్షుడిగా ఆంజనేయప్ప



ఆంజనేయప్ప

రామకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రామకుప్పం మండల అధ్యక్షుడిగా మండల పరిధి మిట్టపల్లెకు చెందిన ఆంజనేయప్ప ఎన్నికయ్యారు. బుధవారం రామకుప్పంలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్ సమక్షంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేతలు రాజసింహ, వెంకటేష్, జనార్ధన్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, నాగరాజు, కమలనాథరెడ్డి, గజేంద్రరెడ్డి, నరసింహ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మధురమలై కొండ ఆర్చి ప్రారంభం



చెన్నపట్నం చెరువు వద్ద ఆర్చిని ప్రారంభించిన గ్రామస్తులు, దాతలు

సోమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట సమీప మధురమలై కొండలో కొలువుదీరిన నేల మల్లేశ్వరస్వామి ఆలయ మార్గంలో దాతలు నిర్మించిన స్వాగత ఆర్చిని బుధవారం ప్రారంభించారు. మార్గం మధ్యలో కాలి నడకన రోడ్డుకి ఇరువైపులా శివనామస్మరణ బోర్డులను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో దాతలు పోలూరు శ్రీనివాసులు, చలపతి, సుధాకర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మల్లప్పకొండపై వైద్యసేవలు



మల్లప్పకొండ ఆలయ ఆవరణలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

గుడుపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం కేసీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే మల్లప్ప కొండపై మల్లేశ్వరుడు ఆలయ శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 300 మంది భక్తులకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో కేసీ ఆసుపత్రి ఎండీ డాక్టర్ మంజునాథ్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ శిల్ప ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాభివృద్ధి కమిటీ ఏర్పాటు



ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వెంకటరమణరెడ్డి

చౌడేపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీని పుంగనూరు టీడీపీ నాయకులు బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకటరమణరెడ్డి బుధవారం ఏర్పాటు చేశారు. 17 ఏళ్ల క్రితం శిథిలావస్థలో ఉన్న ఆలయాన్ని ఆయన సొంత నిధులతో బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత ఆలయంలో గ్రామస్తులు, నూతన కమిటీ సభ్యుల సహకారంతో నిత్య దీపారాధన, ప్రత్యేక పూజలు తదితర అభివృద్ధి కోసం తాను ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు.

23న మాలల సింహగర్జన విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న మాలల జేఏసీ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 23న తిరుపతిలో జరిగే రాయలసీమ మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పుంగనూరు మాలల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో రాయలసీమ మాలల సింహ గర్జన సభ కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయడానికి అంగీకరించి కమిషన్ వేసిందని.. వర్గీకరణకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాయలసీమ పరిధిలోని మాల విద్యార్థులు, మేధావులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో న్యాయవాది గురుమూర్తి, నాయకులు సుమిత్ర రమణ, జేవీ నాగరాజు, శ్రీనివాసులు, కమ్మి రెడ్డి, మహేంద్ర, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలో ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశం కోరే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. మార్చి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ఐదో తరగతి సిలబస్‌పై ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

శంభో.. శివ శంభో..!

● ఆలయాల్లో వేడుకగా మహాశివరాత్రి ఉత్సవాలు



కల్లూరు: మల్లేశ్వరుడికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న చల్లా రామచంద్రారెడ్డి



పుంగనూరు: అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి, వీరభద్రస్వామి



సోమల: దుర్గంకొండలో పూజల్లో పాల్గొన్న పెద్దిరెడ్డి



చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో హోమం చేస్తున్న బోయకొండ మాజీ ఛైర్మన్ ఎస్‌కే వెంకటరమణరెడ్డి



చౌడేపల్లె: పుదిపట్లలో పంచలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు



పలమనేరు: కాశీవిశ్వేశ్వరస్వామి



పెద్దపెంజాణి: జలకంఠేశ్వరస్వామి



కుప్పం: పుష్పాలంకరణలో సోమేశ్వరుడు



రామకుప్పం: అలంకరణలో అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి



గుడుపల్లె: మల్లప్పకొండలో స్వామివారు

కుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని శైవాలయాలలో మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పలు శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. కుప్పం పట్టణంలోని సోమేశ్వరాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం ప్రత్యేకాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పరివార దేవతలకు సైతం నైవేద్యాలు సమర్పించారు. ఆలయాన్ని, స్వామివారిని పుష్ప మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే కంగుంది దుర్గంపై వెలసిన దుర్గం మల్లేశ్వరస్వామికి సైతం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కుప్పం పురపాలక సంఘం, మండల పరిధిలోని పలు శివాలయాలలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

● రామకుప్పం/శాంతిపురం: రామకుప్పం, శాంతిపురం మండలాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామకుప్పం పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాజుపేట సోమేశ్వరస్వామి, విజలాపురం అంగనాథేశ్వరస్వామి ఆలయాల్లోనూ అభిషేక జరిగాయి. తుమ్మిశి, అబకలదొడ్డి, శాంతిపురం, ఎంకేపురం, బెళ్లకోగిల, రాళ్లబూదగూరుల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

● చౌడేపల్లె: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం శివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో రాత్రి 12 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఏ.కొత్తకోటలో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో బోయకొండ మాజీ ఛైర్మన్లు ఎస్‌కే వెంకటరమణారెడ్డి, రతిదేవి దంపతులు వేదపండితులచే రుద్రహోమం, రుద్రాభిషేకం, శివకోటి, పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేపట్టారు. పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవి అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

●సోమల: సోమల మండలంలోని శైవక్షేత్రాలు బుధవారం శివరాత్రి భక్తులతో శివనామ స్మరణంతో కిటకిలాడాయి. ఇరికిపెంట పంచాయతీ మధురమలై కొండలోని మల్లేశ్వరస్వామి ఆలయం, దుర్గంకొండ గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరపురంలోని మల్లేశ్వరాలయం, చెరుకువారిపల్లె అర్ధనారీశ్వరస్వామి, పెద్దఉప్పరపల్లె, రాశెట్టివారిపల్లె, సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. దుర్గంకొండలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని పూజలు చేపట్టారు.

● కల్లూరు: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి సమీపంలో మల్లేశ్వరకొండపై వెలసిన స్వయంభు మల్లేశ్వరస్వామికి బుధవారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక టీడీపీ నాయకులు పూర్ణ కుంభంతో చల్లాకు ఘన స్వాగతం పలికారు. చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్వయంభు మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాధంనాయుడు, ఉయ్యాల రమణ, లెక్కల ధనంజయనాయుడు, కుమార్ రెడ్డి, చెన్నుపాటి ధనంజయనాయుడు, గోపినాయుడు, చెంగ్రాయనాయుడు, అరుణాచలంనాయుడు, ప్రసాద్, గురుమూర్తి, శంకర తదితరులు పాల్గొన్నారు. పులిచెర్ల మండలం దేవళంపేటలోని చంద్రమౌళీశ్వరస్వామిని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

● గుడుపల్లె: మండలంలోని స్వర్ణగిరి మల్లప్పకొండలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేపట్టింది. గుడివంకలోని గంగాధరేశ్వరస్వామి దేవాలయం, కాడేపల్లెలోని శివాలయం, యామిగానిపల్లెలోని శివాలయం, దాసుమానుపల్లెలోని మల్లేశ్వరుడు ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

● పలమనేరు: పలమనేరు మండలంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవళంపేటలోని శివాలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు చేపట్టారు.

● బైరెడ్డిపల్లె: తీర్థం-కోట్రేపల్లె సమీపంలోని కాళభైరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త రాజారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే నాగిరెడ్డిపల్లె సోమేశ్వరాలయం, చీలంపల్లె కపిలేశ్వరాలయం, పాతపేట మల్లికార్జునాలయం, బైరెడ్డిపల్లె సమీపంలోని శివాలయం, వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పుంగనూరు రూరల్: పట్టణంలోని భోగ నంజుండేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, వీరభద్రస్వామి, రాగానిపల్లె మార్గంలోని పరమేశ్వరస్వామి, భీమగానిపల్లె, చదళ్ల గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అగస్త్యేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రామనారాయణరెడ్డి, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మండలంలోని పెద్దగొట్టిగళ్లు ఓంకారేశ్వరస్వామి, మోటుమల్లెల కాశీవిశ్వేశ్వర స్వామి, రొంపిచెర్ల సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాలు పచ్చని తోరణాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

● పెద్దపంజాణి: కోగిలేరు జలకంఠేశ్వర స్వామి ఆలయం, వీరప్పల్లె యోగనందీశ్వరాలయం, ముత్తుకూరు శివాలయం, చలమంగళం సోమేశ్వరాయం, కరసనపల్లె ఆర్కేశ్వరాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి.



బైరెడ్డిపల్లె: అలంకరణలో సోమేశ్వరస్వామి



రొంపిచెర్లలో సిద్దేశ్వరస్వామి



చౌడేపల్లె: అర్ధనారీశ్వర అలంకరణలో వైష్ణవిదేవి

వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో జరిగిన మండల వీఆర్వోల సమావేశంలో నూతన కమిటీ ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, కార్యదర్శిగా జ్యోత్స్న, జాయింట్ కార్యదర్శిగా ఆనంద్, కోశాధికారిగా వేణుగోపాల్, కమిటీ సభ్యులుగా సాయి ప్రసన్న, మునిస్వర్ణ, చంద్రశేఖర్ నాయక్, శ్రీనివాసులు, గణేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ, మండల పరిధిలోని వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

అనాథకు అంతిమ సంస్కారాలు



అంతిమ సంస్కారాలు నిర్వహించిన పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

పలమనేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు బుధవారం ఓ అనాథ శవానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం పలమనేరు మారెమ్మగుడి వీధిలో గుర్తుతెలియని వ్యక్తి (60) మృతిచెందాడు. స్థానికులు పలమనేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ వ్యక్తి శవాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో పెట్టి ఆచూకీ కోసం రెండు రోజులు విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌హ్యాండ్స్ శివ, నరేంద్ర, జీలూబాయ్ పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

చౌడేపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ప్రహరీ నిర్మాణం కోసం టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేలూరు సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీలగిరి తోటకు నిప్పు



నీలగిరితోటలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్ సింగ్ కాలనీ సమీపంలో నీలగిరితోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న దుకాణాల వద్దకు మంటలు వెళ్లకుండా అదుపు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అధిక వడ్డీలతో నష్టపోతున్నామని ఫిర్యాదు



రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న మహిళలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఫైనాన్స్ వారితో నష్టపోతున్నామని, అధిక వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని రొంపిచెర్ల పంచాయతీ లక్ష్మీనారాయణకాలనీకి చెందిన మహిళలు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఎదుట వాపోయారు. బుధవారం ఆయన ఇంటి వద్దకు చేరుకుని ఫిర్యాదు చేశారు. వసూళ్లకు వచ్చి తమ సామాన్లు బయట వేస్తామని బెదిరిస్తున్నారన్నారు. కొంత సమయం ఇస్తే వారికి అప్పు చెల్లిస్తామని వాపోయారు. దీంతో ప్రైవేట్ ఫైనాన్స్ వారితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు విజయ, రెడ్డెమ్మ, ముత్యాలు, తులసీ, కుమారి, కీర్తన పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు



బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రప్పల్లె గ్రామంలోని మహిళలకు, చిన్నారులకు బుధవారం శివరాత్రి సందర్భంగా క్రీడలతో పాటు పాటలు, నృత్యం, భరనాట్యం తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు, మహిళలకు గ్రామస్తులు బహుమతులు అందించారు.

చిత్తూరు ఎమ్మెల్యేపై ఆరోపణలు నిరాధారం

● కూటమి పార్టీ నాయకులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అని కూటమి పార్టీల నేతలు అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బెంగళూరులో న్యాయబద్ధమైన వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. పుట్టిన ఊరికి సేవ చేయాలని, స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలనే ఉద్దేశంతో చిత్తూరుకు వచ్చారన్నారు. అలాంటి వ్యక్తిపై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీలో మాట్లాడిన మాటలన్నీ వాస్తవాలని ప్రజలకు కూడా తెలుసని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. అనర్హత వేటుకు భయపడే వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరయ్యారని అన్నారు. చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు చిత్తూరు కేంద్రంగా 36 ఆర్టీసీ బస్సులను ప్రారంభించారన్నారు. నేతలు గుడిపాల బాలాజి, రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మొగిలీశ్వరుడి సేవలో కలెక్టర్, ఎస్పీ



ఎస్పీ మణికంఠకు జ్ఞాపిక, కుటుంబీకులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వారిని బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

దుర్గంకొండ ఆలయాభివృద్ధికి చర్యలు

సోమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దుర్గంకొండలో ఆగిపోయిన అభివృద్ధి పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం దుర్గంకొండలో జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఆలయం వద్ద జరిగిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆగిన పనులు కొనసాగించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, సుధీరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రభాకర్, నాగేశ్వరరావు, మోహన్, కోదండరాజు, రాజారెడ్డి, సర్వేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తఇండ్లులో వృద్ధుడి ఆత్మహత్య

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తఇండ్లు గ్రామానికి చెందిన వృద్ధుడు గుర్రప్ప(70) జీవితంపై విరక్తితో గ్రామసమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్రప్ప రెండు రోజుల నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. బుధవారం శవమై కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నడుము, కడుపునొప్పి తాళలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. తాలుకా ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ నగర్‌లో జ్ఞానమణి (65), ఆమె కుమార్తె, మనవడు, మనవరాలు ఉంటున్నారు. ఈమెకు గత ఐదురోజులుగా నడుము, కడుపునొప్పితో బాధ పడుతున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన మనవడు చూసి స్థానికుల సహాయంతో ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి.. కనిపించకుండా పోయిన వృద్ధుడు మృతి చెందాడు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18వ తేదీ నగర శివారులో ఉన్న పోతంబట్టుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (60) కనిపించడం లేదని కుమారుడు భరత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీవా నది ఒడ్డున ఓ వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం పోలీసులు వెళ్లి పరిశీలించగా చనిపోయిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డిగా తేలింది. దీంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.



హరహర మహాదేవ

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు









చిత్తూరులోని కాశీ విశ్వేశ్వర, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వర ఆలయాల్లో భక్తుల సందడి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలన్నీ బుధవారం శివనామ స్మరణతో మార్మోగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిశాయి. చిత్తూరులోని కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వర, రంగాచారి వీధిలోని కాశీ విశ్వేశ్వర(రాజుగుడి), ఇరువారం నాగేంద్ర స్వామి, సంతపేట రోడ్డు లక్ష్మీ టాకీస్ ద్వాదశ జ్యోతిర్లింగ అమృత మృత్యుంజయేశ్వర స్వామి, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరస్వామి, సంతపేట చవటపల్లె కనకదుర్గ ఆలయాల్లో పూజలు, అభిషేకాలు జరిగాయి. అగస్త్రీశ్వర ఆలయంలో పూజల్లో చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. ● గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో రుద్రాభిషేకం నిర్వహించారు. ● నగరంలో పలు ప్రాంతాల్లో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం వారు ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ● తోటపాళ్యం వీరభద్ర స్వామికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పి.షణ్ముగం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ఐరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గార్గేయ నదీ తీరాన మఠంపల్లెలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరఫున పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం స్వామికి అభిషేకం చేశారు.



మహాశివుడికి క్షీరాభిషేకం

ఆలయ ప్రాంగణంలోని మహాశివలింగానికి రుద్రాభిషేకం, మహాన్యాస పూజను నిర్వహించారు. అలాగే కాణిపాకంలో వరసిద్ధుడి ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయం, కుళ్లంపల్లెలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయానికి వరసిద్ధుడి ఆలయం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. నాంపల్లెలోని పుష్పవనేశ్వర స్వామి, పొలకలసంతగేటులోని కాలభైరవేశ్వర స్వామి ఆలయాల్లోనూ వేడుకలు జరిగాయి. కుళ్లంపల్లెలో దక్ష యాగాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో జడ్పీటీసీ సుచిత్ర, మఠంపల్లె మిట్ట వీరభద్రస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సాయీశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, నాయకులు హరిబాబునాయుడు, రాజేష్‌రెడ్డి,రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

తవణంపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె కాలభైరవేశ్వరస్వామి, అరగొండ స్వయంభువనేశ్వర, కంపలపల్లె గ్రామం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాలభైరవేశ్వర స్వామికి కాణిపాక వరసిద్ధుడి ఆలయం తరఫున పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్‌లు పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయం తరఫున కూడా ప్రధానార్చకుడు, సిబ్బంది పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శివమాల ధరించిన భక్తులు ఇరుముడి చెల్లింపులు నిర్వహించి, కర్పూర హారతి ఇచ్చారు. సాయంత్రం స్వామివారిని భైరవ వాహనంపై మేళతాళాల నడుమ తవణంపల్లె పురవీధుల్లో ఊరేగించారు. కార్యనిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



కాలభైరవేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

పాలసముద్రం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాచపాళ్యంలోని బాలగురునాథీశ్వర, శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని పాలకొండపై ఉన్న శివాలయంలో వేడుకలు జరిగాయి. బాలగురునాథీశ్వరాలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమం నిర్వహించారు. తమిళనాడులోని పళ్లిపట్టు తహసీల్దార్ విమల కుమారి, టీడీపీ కార్యనిర్వహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాలగురునాథీశ్వరాలయంలో రుద్రహోమం

యాదమరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మంజునాథుడి రూపంలో స్వామిని అలంకరించి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం ఆలయంలో కీర్తనలు ఆలపించారు. అర్ధరాత్రి లింగోద్భవం, అభిషేకాలు జరిగాయి. అర్చకుడు చంద్రశేఖర్ శాస్త్రి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.



మంజునాథ అలంకారంలో ఏకాంబరేశ్వరుడు

గుడిపాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 197 రామాపురంలోని పోతులూరి వీరబ్రహ్మంగారి మఠంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మంగారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదే గ్రామంలోని జ్ఞానప్రసూనాంబ సమేత యజ్ఞేశ్వర స్వామి దేవస్థానంలో శివపార్వతుల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. ఉత్సవర్లను ఊరేగించారు. ఆలయ ధర్మకర్త వడింగాటి ఆనంద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శివపార్వతులకు పట్టువస్త్రాలను తహసీల్దార్ జయంతి, ఎంపీడీవో శివరాజ్, ఎస్‌ఐ రామ్మోహన్, సర్పంచ్ జనార్దన్ సమర్పించారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు.



197 రామాపురంలో బ్రహ్మంగారి కల్యాణోత్సవం

విజయపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గంగమాంబాపురంలో నందీశ్వరుడికి అభిషేకం, పూజలు చేశారు. పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వరస్వామికి పూజలు, చెంగమ నాయుడు కండ్రిగలో సహస్ర లింగేశ్వరుడికి లక్షబిల్వార్చన చేశారు. జగన్నాథపురంలో శ్రీరామనామ క్షేత్రంలో ఈశ్వరుడికి, చిన్న జంబాడలో జంబులింగేశ్వర స్వామికి, పాతార్కాడులో శివుడికి పూజలు జరిగాయి. జంబులింగేశ్వరస్వామిని మాజీ మంత్రి ఆర్కే రోజా దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు జయరామరాజు, చంద్రశేఖర్‌రాజులు ఆమెను సత్కరించారు.



జంబులింగేశ్వరస్వామి సేవలో మాజీ మంత్రి రోజా

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని ఆత్మలింగేశ్వరుడికి, 49.కొత్తపల్లెలోని పార్వతీసమేత బిల్వేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ఆత్మలింగేశ్వరుడి ఆలయం వద్ద భక్తులకు శీతల పానీయాలను బొస్స్ కూల్‌డ్రింక్స్ అధినేత తిలక్ వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త మోహన్ నాయుడు, యుగంధర్, చెంచురెడ్డి పాల్గొన్నారు.

నింద్ర, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నింద్రలోని కామాక్షి సమేత భిక్షాటేశ్వర ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయ దాతలుగా శ్రీనివాసులు రాజు వ్యవహరించారు.



భిక్షాటేశ్వరస్వామి

పెనుమూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పులిగుండు, రామాపురం, కలవగుంట, కావూరివారిపల్లె, పెనుమూరు శివాలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో గంగాధరేశ్వరస్వామి, కొట్రకోనలో మల్లేశ్వరస్వామి, మహదేవమంగళంలో మహదేశ్వరస్వామి, సిద్దేశ్వరకొండలో సిద్దేశ్వరస్వామి, వెజ్జుపల్లె, వేల్కూరులో ఈశ్వరాలయాలను భక్తులు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథాకాలక్షేపం, కోలాటాలు నిర్వహించారు.



మల్లేశ్వరస్వామి - గంగాధరేశ్వరస్వామి

పూతలపట్టు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని భీమేశ్వరస్వామి, మిట్టూరు వద్ద ఉన్న బాటగంగమ్మ, కోట్లపల్లె సమీపాన గల మల్లేశ్వరస్వామి, తిమ్మిరెడ్డిపల్లె, గొడుగుచింతలోని ఈశ్వరాలయాల్లో ఉత్సవాలు జరిగాయి. బాటగంగమ్మ ఆలయం వద్ద రాత్రి తిరుపతివారి పాటకచ్చేరి, వీధినాటకం ప్రదర్శించారు.

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం సుద్దగుంట సమీపంలోని శిష్ట సౌందర్యవల్లీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్కంధ పుష్కరిణి సమీపంలో ఉన్న ఉమా తంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. చాకలివాని గుంట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి, డైట్ ఆవరణంలోని ఉమా మహేశ్వర, కొటార్వేడులోని అగస్త్రీశ్వర, పాదిరికుప్పం సమీపంలో ఉన్న ఈశ్వరాలయాల్లోనూ పూజలు జరిగాయి. డేరాకండ్రిగ సమీపంలో ఉన్న నైనేరమ్మ దేవస్థానంలో ఊంజల్ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నగరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కీలపట్టులో త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. గుండ్రాజుకుప్పం, కళింమిట్ట ఆలయాలను ఎమ్మెల్యే భానుప్రకాష్ దర్శించుకున్నారు. కామాక్షిసమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో శతరుద్ర మహాయాగంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. బుగ్గగుడిలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. మాజీమంత్రి ఆర్కే రోజా సైతం పలు దేవాలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.



అగస్త్రీశ్వరస్వామి



కళింమిట్ట శివాలయంలో పూర్ణకుంభంతో స్వామి దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



కొండమల్లీశ్వరుడికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాంబేడు గ్రామ పంచాయతీ డీఆర్ ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణంతో మహాశివరాత్రి ఉత్సవాలు మొదలయ్యాయి. స్వామివారికి ప్రభుత్వ విప్ థామస్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కృష్ణారెడ్డి, కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. స్వామికి ప్రభుత్వ విప్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి, నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● కమ్మకండ్రిగ సమీపంలోని స్వయంభు సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలోనూ శివపార్వతుల కల్యాణోత్సవం జరిగింది. ప్రభుత్వ విప్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త బట్టే చాణిక్యప్రతాప్ సహా కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● తిరుమలయ్యపల్లెలోని బండెమ్మ కొమరెడ్డయ్య సమేత ఆవుదేవర నందీశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో రుద్రాభిషేకం, పూజలు కల్యాణోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్త అరుణమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సదాశివేశ్వర స్వామి - కొండమల్లీశ్వరస్వామి - కమ్మకండ్రిగలో శివపార్వతుల కల్యాణోత్సవం

మొగిలీశ్వరుడి సేవలో కలెక్టర్, ఎస్పీ



ఎస్పీ మణికంఠకు జ్ఞాపిక, కుటుంబీకులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి వారిని బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

మీరు సహకరిస్తే పారిశ్రామిక హబ్‌గా తయారుచేస్తా


కలెక్టర్‌తో ప్రభుత్వ విప్ థామస్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మీవంతు సహకారం అందిస్తే గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తయారు చేస్తానని కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. ఎస్సీ నియోజకవర్గం కావడంతో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందలేదని, ఇప్పటికే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా బుధవారం జీడీనెల్లూరుకు వచ్చిన కలెక్టర్‌తో ఈవిషయమై చర్చించినట్లు సమాచారం.

తమిళ డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళ డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏజీఎస్ మేనేజ్మెంట్ సర్వీసెస్ ఎండీ రూపేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు వైట్ ఫీల్డ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ దాల్మ్యాట్ యుటిలిటీ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నెలకు రూ.17,500 వేతనం కింద సీతమ్స్‌లో పనిచేయాల్సి ఉందన్నారు. దాదాపు వంద మంది కావాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువతీయువకులు మార్చి ఒకటో తేదీలోపు చర్చివీధిలోని ఎంఆర్‌పి కాంప్లెక్స్‌లోని చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. వివరాలకు 08572-234531 నెంబరులో సంప్రదించాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య



చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నడుము, కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. తాలూకా ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ నగర్‌లో జ్ఞానమణి (65), ఆమె కుమార్తె, మనవడు, మనవరాలు ఉంటున్నారు. ఈమెకు గత ఐదురోజులుగా నడుము, కడుపునొప్పితో బాధపడుతున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన మనవడు చూసి స్థానికుల సహాయంతో ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లి.. కనిపించకుండా పోయిన వృద్ధుడు మృతి చెందాడు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18వ తేదీ నగర శివారులో ఉన్న పోతంబట్టుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (60) కనిపించడం లేదని కుమారుడు భరత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీవానది ఒడ్డున ఓ వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం పోలీసులు వెళ్లి పరిశీలించగా చనిపోయిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డిగా తేలింది. దీంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేపై వైసీపీ నేతల ఆరోపణలు నిరాధారం

● కూటమి పార్టీ నాయకులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అని కూటమి పార్టీల నేతలు అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బెంగళూరులో న్యాయబద్ధమైన వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. పుట్టిన ఊరికి సేవ చేయాలని, స్వచ్ఛమైన రాజకీయాలు చేయాలనే ఉద్దేశంతో చిత్తూరుకు వచ్చారన్నారు. అలాంటి వ్యక్తిపై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మాజీ సీఎం జగన్‌పై అసెంబ్లీలో మాట్లాడిన మాటలన్నీ వాస్తవాలని ప్రజలకు కూడా తెలుసని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. అనర్హత వేటుకు భయపడే వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరయ్యారని అన్నారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు చిత్తూరు కేంద్రంగా 36 ఆర్టీసీ బస్సులను ప్రారంభించారన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి శాసనసభ సమావేశాల్లోనే చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.350 కోట్లు అవసరమని సీఎం చంద్రబాబును జగన్మోహన్ కోరారని తెలియజేశారు. నేతలు గుడిపాల బాలాజి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సీఎం విజయ, వెంకటేష్ యాదవ్, రాజశేఖర్, ఈశ్వర్, అశోక్, ఆనంద్, శేషాద్రి, నవీన్, జగదీశ్వర్ నాయుడు, అరుణ కుమారి, జనసేన నేత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కూటమి పార్టీల నాయకులు

చిత్తూరు అభివృద్ధిపై దృష్టి పెట్టండి: వైసీపీ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పిచ్చి మాటలు మాని చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ దృష్టి పెట్టాలని చిత్తూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి సూచించారు. అసెంబ్లీలో చిత్తూరు ఎమ్మెల్యే మాజీ సీఎం జగన్‌పై చేసిన విమర్శలపై బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా ఇచ్చిన యూనివర్సిటీ, ఇండస్ట్రియల్ హబ్, గ్రీన్ పార్క్ వంటివాటిని సాధించడానికి ప్రయత్నించాలి తప్ప చౌకబారు మాటలు ఎందుకన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నేతలు కేపీ శ్రీధర్, రాసనపల్లె ప్రకాష్, గాయత్రిదేవి, జ్ఞాన జగదీశ్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయించండి

ప్రభుత్వ విప్‌కు హౌసింగ్‌శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు చెప్పి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయించాలని హౌసింగ్ శాఖలో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులు కోరారు. ఈ మేరకు బుధవారం గంగాధరనెల్లూరులో సీఎం చంద్రబాబు పర్యటన కార్యక్రమాలను పరిశీలించడానికి వచ్చిన ప్రభుత్వ విప్ థామస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ధనుంజయులు, ప్రధానకార్యదర్శి కనకరాజులు, ట్రెజరర్ బుక్కాపట్నం గీత, తదితరులు పాల్గొన్నారు

ఆర్వో ప్లాంట్ల గతి ఇంతేనా?

శుద్ధ జలం అందడం లేదని జనం ఆవేదన

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత మంచినీరు తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మినరల్ వాటర్(ఆర్వో) ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇలా వెదురుకుప్పం మండలంలోని వెదురుకుప్పం, పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె, గంటావారిపల్లి, జక్కిదొన, ఆళ్లమడుగు, యనమలమంద తదితర ప్రాంతాల్లో ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. అయితే నిర్వాహకుల్లో చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఇవన్నీ నిరుపయోగమయ్యాయి.

నిబంధనలు పాటించక పోవడమేనా?

ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసే సమయంలో నిబంధనలను పాటించలేదని తెలుస్తోంది. సమృద్ధిగా నీరు వచ్చే తాగునీటి బోరు, విద్యుత్ కనెక్షన్, మోటరు వంటి వసతులను సంబంధిత అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. అందువల్లే ఏ ప్లాంటు నుంచి కొంతకాలం కూడా శుద్ధ జలం అందించిన దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులను ఇలా వృథా చేసిన వారిపై చర్యలు తీసుకోక పోవడం అటుంచితే.. ఈ ప్లాంట్ల గురించే పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ ఆర్వో ప్లాంట్లపై అధికారులు, నాయకులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



పచ్చికాపల్లం, వెదురుకుప్పంలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్లు

అనాథకు అంతిమ సంస్కారాలు

పలమనేరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మారెమ్మగుడి వీధిలో రెండ్రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి (60) మృతి చెందాడు. మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచి పోలీసులు విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు తెలియజేయడంతో వారు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సభ్యులు శివ, నరేంద్ర, జీలూబాయ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలో ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

సంక్షిప్తంగా..

టీడీపీ నేతకు నివాళి

యాదమరి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా మృతిచెందిన టీడీపీ సీనియర్ నేత బొమ్మనచేను సుబ్రహ్మణ్యం మృతదేహానికి ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు నివాళులర్పించారు. టీడీపీ మండల కన్వీనర్‌గా, ఎంపీటీసీగా, సమితీ ప్రెసిడెంట్‌గా పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మూర్తి యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రటీ, హేమగిరి, వినాయకం గౌండర్, అమరనాథ నాయుడు పాల్గొన్నారు.

అంకాల పరమేశ్వరికి అభిషేకం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి.. బ్రహ్మ కపాల పూజలు చేశారు. అంతకు ముందు నీవానది శ్మశానం నుంచి బ్రహ్మ కపాలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో గరిగ పూజలు నిర్వహించారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బంగారుపాళ్యం,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చీకూరుపల్లె కొండపై వెలిసి ఉన్న సిద్ధేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి బుధవారం సరోజిని స్కూల్ యాజమాన్యం సుధాకర్‌నాయుడు, సరస్వతి దంపతులు రూ.లక్షను విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయుడు రఘుపతినాయుడు, నాయకులు రవి,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

6న దుకాణాలకు వేలం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయం దుకాణాలను మార్చి ఆరో తేదీన వేలం వేయనున్నట్లు ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఆలయం ఎదురుగా 11-298 నెంబరు, పొన్నియమ్మ గుడి వీధిలోని 17-50 నెంబరు, పిళ్లారి గుడి వీధిలోని 11-526-5 నెంబరు, సంతపేటలోని 5-715 నెంబరు గల దుకాణాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆలయ పని వేళల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.